సాక్షి
అన్నమయ్య జిల్లా
శుక్రవారం । 28 । జూన్ । 2024



భార్యను చంపిన భర్త అరెస్ట్

భార్యను చంపిన కేసులో నిందితుడైన భర్తను అరెస్టు చేసినట్టు సీఐ సూర్యనారాయణ తెలిపారు. కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. -8లో



ఎర్రచందనం దుంగలు స్వాధీనం

కారుతో సహా రూ.25 లక్షల విలువైన ఎర్ర చందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు డీఎఫ్‌వో జె.వి.సుబ్బారెడ్డి తెలిపారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.480	రూ.560
రెండోరకం	రూ.330	రూ.460

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 927 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ రాక

కడప సెవెన్‌రోడ్స్: ఐదో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ శుక్రవారం కడపకు వస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి డి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. జిల్లా పరిషత్ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో ఈ సందర్భంగా సమావేశం ఉంటుందన్నారు. ఫైనాన్స్ కమిషన్ చైర్ పర్సన్ ప్రొఫెసర్ ఎస్.రత్నకుమారి, మెంబర్ సెక్రటరీ డాక్టర్ కేవీ రమణారెడ్డి ఈ సమావేశానికి హాజరవుతారన్నారు. గ్రామ, మండల జిల్లా పరిషత్ సమస్యలు, పన్నులు, వ్యయాలు, ప్రాథమిక అవసరాలు, కేంద్ర, రాష్ట్ర స్కీములపై చర్చిస్తారన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓతో పాటు జిల్లాకు చెందిన డీఎల్‌పీఓలు, ఎంపీడీఓలు, ఓఈపీఆర్ అండ్ ఆర్‌డీలు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొని వివిధ సమస్యలపై చర్చిస్తారని వివరించారు.

రైళ్ల గడువు పొడిగింపు

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా మీదుగా నడుస్తున్న అహ్మదాబాద్-తిరుచునాపల్లి (09419/09420), మధురై-ఓకా-మధురై (09519/09520) రైళ్ల గడువును పొడిగించినట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు.అహ్మదాబాద్ నుంచి తిరుచునాపల్లికి వెళ్లే రైళ్ల గడువు ఈనెల 27వ తేదిన ముగియనుండగా, దానిని సెప్టెంబరు 26వ తేది వరకు, తిరుచునాపల్లి నుంచి అహ్మదాబాద్‌కు వెళ్లే ప్రత్యేక రైలు గడువు ఈనెల 30న ముగియనుండగా, ఆ రైలును సెప్టెంబరు 29వ తేది వరకు పొడిగించారన్నారు. ఓకా-మధురై మధ్య నడుస్తున్న ప్రత్యేక రైలు గడువు ఈనెల 24తో ముగిసిందని, దానిని సెప్టెంబరు 30వ తేది వరకు పొడిగించారన్నారు. మధురై-ఓకా మధ్య నడిచే ప్రత్యేక రైలు గడువు ఈనెల 28వ తేదిన ముగియనుందని, దీనిని అక్టోబరు 4 వరకు పొడిగించారన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గుర్తించాలని ఆయన కోరారు.

ముగిసిన పీహెచ్‌డీ ప్రవేశాల ఇంటర్వ్యూలు

వైవీయూ: ఏపీ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఆర్‌సెట్)లో అర్హత సాధించిన విద్యార్థులకు పీహెచ్‌డీ ప్రవేశాల ఇంటర్వ్యూల ప్రక్రియ గురువారం ముగిసింది. ఈనెల 24 నుంచి ఫైన్‌ఆర్ట్స్, మెటీరియల్ సైన్స్ అండ్ నానోటెక్నాలజీ, మ్యాథమ్యాటిక్స్, పొలిటికల్ సైన్స్, సైకాలజీ సబ్జెక్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి అభ్యర్థులు హాజరయ్యారు. వివిధ విశ్వవిద్యాలయాల నుంచి ఆచార్యులు విచ్చేసి ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు. చివరిరోజు గురువారం సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె. లలిత, సహ ఆచార్యులు డా. వి. లాజర్, తిరుపతి ఎస్వీయూ సైకాలజీ ఆచార్యులు ఎస్. విశ్వనాథరెడ్డి, మైసూరు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా. సంపత్‌కుమార్ ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైవీయూ ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ పీహెచ్‌డీ ప్రవేశాల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందన్నారు.

డీసీసీబీ, డీసీఎంఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ గణేష్‌కుమార్



జేసీ గణేష్‌కుమార్‌కు అభినందనలు తెలుపుతున్న సుభాషిణి, రాజామణి

కడప అగ్రికల్చర్: జిల్లా సహకారం కేంద్ర బ్యాంకు(డీసీసీబి), జిల్లా సహకారం మార్కెటింగ్‌శాఖ(డీసీఎంఎస్)లకు అఫీసియల్ పర్సన్ ఇన్‌చార్జిగా జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆయన బుధవారం సాయంత్రం డీసీఓ సుభాషిణి, డీసీసీబి ఇన్‌చార్జి సీఈఓ రాజామణిల సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీసీసీబీ, డీసీఎంఎస్‌ల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆయనకు డీసీఓ, డీసీసీబీ ఇన్‌చార్జి అభినందనలు తెలిపారు.

కేవీకేను వరించిన పురస్కారాలు

కడప అగ్రికల్చర్: కడప ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రానికి(కేవీకే) మూడు పురస్కారాలు లభించాయి. రాజమండ్రి వేదికగా జరుగుతున్న జోనల్ స్థాయి కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక కార్యాచరణ కార్యశాలలో బుధవారం అవార్డులను కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్యకు అందచేశారు. ఇందులో భాగంగా గ్రామీణ యువతను వ్యవసాయ, వ్యవసాయ ఆధారిత రంగాలవైపు ఆకర్షించే పథకాన్ని విజయవంతంగా నడిపిస్తున్నందుకు, మినుములో పల్లాకు తెగులు తట్టుకునే రకాలను జిల్లాలో విస్తరించినందుకు, స్పాన్సర్డ్ శిక్షణా కార్యక్రమాలను ఎక్కువగా జరపడం వంటి మూడు విభాగాలకు సంబంధించి పురస్కారాలు లభించాయి. వ్యవసాయ సాంకేతిక విజ్ఞాన అను ప్రయోగ సంస్థ(అలారీ) జోన్-10 డైరెక్టర్ డాక్టర్ షేక్.ఎన్. మీర, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ బి. ప్రమీలరాణి తదితరుల చేతుల మీదుగా అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు.

ఇసుక తోడేళ్లు

- పెన్నానదిలో యధేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- పోటాపోటీగా కొనసాగిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఎంపీ రమేష్‌ల అనుచరులు
- ప్రొద్దుటూరు మండలం రేగులపల్లి గ్రామంలో అక్రమ మైనింగ్
- పోట్లదుర్తి మీదుగా ఇతర ప్రాంతాలకు తరలింపు
- పాపాఘ్నిని చెరబట్టిన తెలుగుతమ్ముళ్లు
- వేంపల్లెలో రెండు వర్గాలు పోటాపోటీగా అక్రమ రవాణా
- కొత్తూరు, తుమ్మలూరు, మాచునూరు, పైడికాల్వ, పొడదుర్తి నుంచి నిత్యం దోపిడీ





ప్రొద్దుటూరు మండల పరిధిలోని రేగులపల్లెలో పొక్లెయిన్‌తో ఇసుక కోసం తవ్వకాలు

సాక్షి ప్రతినిధి, కడప: కొత్త ప్రభుత్వం కొలువుతీరింది. ఇసుక పాలసీపైన స్పష్టత లేదు. ఈలోపు దొరికిన కాడికి దోచుకోవాలనే తలంపు తెలుగుతమ్ముళ్లల్లో మెదిలింది.అంతే, ఆలస్యం చేయకుండా ఎవరిస్థాయిలో వారు ట్రాక్టర్ మొదలు పొక్లెయిన్లతో లోడింగ్ చేస్తూ టిప్పర్లతో ఇసుక అక్రమ రవాణాకు తెరలేపారు. ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో నదులను గుల్ల చేస్తున్నారు. అక్రమ సంపాదన కోసం తెలుగుతమ్ముళ్లు పోటీ పడుతున్నారు. పెన్నా, పాపాఘ్ని, చెయ్యేరు నదులను చెరబట్టారు. ఇతర ప్రాంతాలకు యధేచ్ఛగా తరలిస్తున్న వైనం వారం రోజులుగా ఊపందుకుంది.

ఉమ్మడి కడప జిల్లాలో మైనింగ్ స్మగ్లింగ్ ఊపందుకుంది. ఆయా నియోజకవర్గాల్లో అనుచరులు పోటాపోటీగా ఇసుక తరలిస్తున్నారు. ఎంపీ రమేష్‌నాయుడు అనుచరులు మొదలు పెడితే, ఆ పక్కనే ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వర్గీయులు ఆరంభించారు. వేంపల్లె కేంద్రంగా టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి వర్గీయులు ప్రారంభిస్తే, వెనువెంటనే ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి వర్గీయులు అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. కమలాపురం నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మెల్యే చైతన్యరెడ్డి వర్గీయులు యధేచ్ఛగా కొల్లగొడుతున్నారు. ఇలా ఎక్కడికక్కడ ప్రభుత్వ నిర్ణయం వెలువడక ముందే అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు.

తిరగబడ్డ హనుమాన్‌గుత్తి గ్రామస్తులు..

ప్రొద్దుటూరు మండలం రేగులపల్లి గ్రామ పరిధిలో పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను హనుమాన్ గుత్తి, పోట్లదుర్తి మీదుగా వివిధ పట్టణాలు, సిటీలకు తరలిస్తున్నారు. తొలుత ఎంపీ రమేష్‌నాయుడు వర్గీయులు ఆరంభించగా, వెంటనే ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వర్గీయులు రంగ ప్రవేశం చేశారు. పోటాపోటీగా అక్రమ రవాణా వ్యవహారాన్ని గమనించిన ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి అడ్డుకున్నారు. భవిష్యత్‌లో తాగునీరు కూడా కష్టమేనని ఆవేదన చెందుతూ టిప్పర్లతో తరలిస్తుండగా అడ్డుపడ్డారు. పాపాఘ్ని నదిలో వేంపల్లె కేంద్రంగా పొరుగు గ్రామానికి చెందిన ఓ నాయకుడు పొక్లెయిన్ పెట్టి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే, మరుసటి రోజు వేంపల్లెకు చెందిన నాయకులు మరో పొక్లెయిన్ పెట్టి టిప్పర్లతో ఇసుక తరలించడం ఆరంభించారు. కొత్తూరు, నందిమండలం, తుమ్మలూరు, మాచునూరు, పైడికాల్వ, పొడదుర్తి ఇలా గ్రామగ్రామాన పాపాఘ్ని నది నుంచి ఇసుక కొల్లగొడుతున్నారు. పొడదుర్తి నుంచి పగలంతా వెంకటాపురం సమీపంలోని చెన్నకేశవస్వామి వెనుక వైపు డంపింగ్ చేయడం అక్కడి నుంచి అక్రమ రవాణా యధేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఇదే విషయమై స్థానికులు మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులకు ఎవ్వరికి ఫిర్యాదు చేసినా అటువైపు కన్నెత్తి చూడడం లేదని పలువురు వాపోతున్నారు.



పొక్లెయిన్లతో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు



గ్రామస్తులు అడ్డుకున్న వాహనాలు

రహదారి వేసి మరీ అక్రమ రవాణా...

నదుల్లోకి టిప్పర్లు వెళ్లేందుకు రహదారులు ఏర్పాటు చేసి మరీ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ప్రభుత్వానికి పైసా రాయల్టీ చెల్లించకుండా ప్రకృతి సంపదను దోపిడీ చేస్తున్నారు. గ్రామస్తులు ప్రత్యక్షంగా ఆందోళన చేస్తే అధికారులు మమ అనిపిస్తూ అటువైపు పర్యటనకు మొగ్గుచూపుతున్నారు. రేగులపల్లి నుంచి ఇసుక పదుల సంఖ్యలో టిప్పర్లతో తరలిస్తున్న వైనంపై హనుమాన్ గుత్తి గ్రామస్తులు ప్రత్యక్ష ఆందోళన చేస్తే రెవెన్యూ యంత్రాంగం గురువారం వెళ్లి నదిలో నిర్మించిన రహదారిని మాత్రమే చెరిపేయగలిగారు. అందుబాటులో ఉన్న పొక్లెయిన్లను సీజ్ చేసి, కేసు నమోదు చేసిన పాపాన పోలేదని ఆయా గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వ నూతన పాలసీ వచ్చే వరకు ఇసుకను కాపాడకపోతే, సత్వరమే తాగునీటి సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా అధికార యంత్రంగాం నిద్రమత్తు వీడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.



ఇసుక తరలింపునకు నది మధ్యలో వేసిన రహదారి

గండికోట జలాశయంలో చేపల వేట నిషేధం



కొండాపురం: గండికోట జలాశయంలో జూలై 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు చేపల వేట నిషేధించినట్లు కడప ఉప మత్స్య సంచాలకులు కె. శాంతి గురువారం తెలిపారు. చేపలు వృద్ధి చెందేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మత్స్యకారులు చేపల వేటకు వెళితే కఠిన చర్యలు తీసుకుంటామని, జరిమాన విధిస్తామన్నారు. కార్యక్రమంలో మత్స్య అభివృద్ధి అధికారి కిరణ్‌కుమార్, వీఎస్ఏ మల్లేశ్వరి పాల్గొన్నారు.

సురక్షితంగా గమ్యం చేర్చడమే ధ్యేయం

మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి అర్బన్: ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చడమే ఆర్టీసీ ధ్యేయమని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి ఆర్టీసి బస్టాండులో ఆయన రాయచోటి - తిరుపతి నూతన లగ్జరీ బస్సు సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రాబోయే కాలంలో మరిన్ని నూతన బస్సులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కూడా త్వరలో ప్రారంభిస్తామన్నారు. రాయచోటిని జిల్లా కేంద్రంగా తొలగిస్తున్నారా ? అన్న ఓ ప్రశ్నకు ఆయన స్పందిస్తూ ఎట్టి పరిస్థితుల్లోనూ జిల్లా కేంద్రం మార్పు ఉండబోదన్నారు. తమది ప్రజా ప్రభుత్వమని, ప్రజాభిప్రాయానికి అనుగుణంగా నడుచుకుంటుందని అన్నారు. రాబోయే కాలంలో రాయచోటిని మరింతగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఆర్టీసీ కడపజోన్ ఈడీ జి.వెంకటేశ్వరరావు, అన్నమయ్య జిల్లా రవాణ అధికారి పి.రాము, రాయచోటి డిపో మేనేజర్ ధనుంజయ, ఆర్టీసి ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.



రిబ్బన్ కట్‌చేసి బస్సును ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, అధికారులు

పకడ్బందీగా పెన్షన్ల పంపిణీ

జిల్లా కలెక్టర్ అభిషిక్త్‌కిషోర్



రాయచోటి: జిల్లాలో జులై 1, 2వ తేదీలలో చేపట్టనున్న పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం వెలగపూడి, ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి గురువారం పెన్షన్లపంపిణీ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్ సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, జీఎస్‌డబ్ల్యు ఏఓ లక్ష్మీపతి, తదితర అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని సచివాలయ ఉద్యోగులు, ఇతర ఉద్యోగుల ద్వారా పంపిణీ చేయనున్నట్లు వివరించారు. జులై 1వ తేదీ 6 గంటలకు పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. పెన్షన్ల పంపిణీపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సజావుగా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు.

'సంపూర్ణత అభయాన్'కు 3 మండలాల ఎంపిక

కేంద్ర ప్రభుత్వ నీతి ఆయోగ్ సంస్థ ఆదేశాల మేరకు జూలై 4న జిల్లాలో సంపూర్ణత అభయాన్ కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ ఎం అభిషిక్త్ కిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ క్రింద జిల్లాలో సంపూర్ణ అభయాన్ కార్యక్రమం అమలు, సాధించాల్సిన లక్ష్యాలు, చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై వైద్య, ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమం, వ్యవసాయ, డీఆర్‌డీఏ, ప్రణాళిక అధికారులతో జిల్లా కలెక్టర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నీతి ఆయోగ్ సంస్థ నిర్దేశించిన ఇండికేటర్లు, ప్రసవానంతర సంరక్షణ కోసం నమోదు చేసుకున్న గర్భిణీ స్త్రీల శాతం, అమలు చేస్తున్న కార్యక్రమాలు, రివాల్వింగ్ ఫండ్ కల్గిన స్వయం సహాయక సంఘాల శాతంలపై వైద్య, ఆరోగ్య, ఐసీడీఎస్, వ్యవసాయ, డీఆర్‌డీఏ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. పలు అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై దిశా కలెక్టర్ నిర్దేశం చేశారు. అన్నమయ్య జిల్లాలో కోడూరు, కురబలకోట, లక్కిరెడ్డిపల్లి మండలాలు ఈ కార్యక్రమానికి ఎంపికైనట్లు తెలిపారు. జిల్లాలో ఈ కార్యక్రమం క్రింద చేపట్టి నిర్దేశించిన ఇండికేటర్లలో చిత్తశుద్ధితో నూరుశాతం ఫలితాలు సాధించాలన్నారు. ప్రజలు భాగస్వాములై కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. అనంతరం వివిధ అంశాలలో పలు సూచనలు జారీ చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, సంబంధిత జిల్లా అధికారులు, మూడు మండలాలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

సౌర వెలుగులు.!

- సౌర విద్యుత్ వినియోగంపై ప్రభుత్వ దృష్టి
- ఆర్టీసీ డిపోల్లో విజయవంతంగా అమలు
- విద్యుత్ బిల్లుల బాదుడు నుంచి ఉపశమనం



ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ పలకలు

మదనపల్లె సిటీ: విద్యుత్ సమస్యల నుంచి బయటపడేందుకు సౌరవిద్యుత్ వినియోగం మంచి ఆలోచన. రోజురోజుకు పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం సౌరవిద్యుత్‌పై దృష్టి సారించింది. ప్రధానంగా ప్రభుత్వ సంస్థల్లో విద్యుత్ వినియోగానికి సౌర విద్యుత్‌ను వాడేందుకు ఏర్పాట్లు చేసింది. ఈ నేపథ్యంలో మదనపల్లె ఆర్టీసీ -1, 2 డిపోలు, గ్యారేజీలు, బస్‌స్టేషన్, జెడ్పీ హైస్కూల్ ప్రాంగణాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసింది. వీటి ద్వారా వస్తున్న విద్యుత్‌ను ఆ సంస్థలు సమర్థవంతంగా వినియోగించుకుంటూ నెలనెలా వస్తున్న బిల్లుల నుంచి ఉపశమనం పొందాయి. మదనపల్లెలో సౌర వెలుగులపై ప్రత్యేక కథనం...

మదనపల్లె ఆర్టీసీ డిపోలు: ఆర్టీసీ సౌర విద్యుత్ బాట పట్టింది. తన ఆస్తులను మరింత సమర్థవంతంగా సద్వినియోగం చేసుకునే వ్యూహంలో భాగంగా బస్ స్టేషన్, డిపోలు, గ్యారేజీ భవనాలపై సోలార్ విద్యుత్ ప్లాంట్లు నెలకొల్పారు. పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలో నాలుగు డిపోలను ఎంపిక చేశారు. అందులో భాగంగా 2018లో మదనపల్లె ఆర్టీసీ డిపోలో సోలార్ ప్లాంటును ఏర్పాటు చేశారు. 100 కిలో వాట్ల సామర్థ్యంతో వీటిని ఏర్పాటు చేశారు. ఇందుకోసం రూ.37 లక్షల వరకు వెచ్చించారు. ప్లాంటు ద్వారా నెలకు 10 వేల యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. సుమిత్ సంస్థ టెండర్ ద్వారా ఆర్టీసీకి 25 ఏళ్లపాటు తక్కువ ధరకు విద్యుత్ సరఫరా చేస్తుంది. వీటి ద్వారా బస్‌స్టేషన్ రెండు డిపో కార్యాలయాలు, గ్యారేజీలో సోలార్ విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. వన్, టు డిపో కార్యాలయాలపై 326 పలకలను ఏర్పాటు చేశారు. గతంలో విద్యుత్ బిల్లు నెలకు రూ.1.50 లక్ష వరకు వచ్చేది. సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసిన తరువాత నెలకు సరాసరి రూ.40-50 వేలు బిల్లు వస్తోంది. సగటున నెలకు రూ.లక్ష వరకు ఆదా అవుతోంది. గత 7 సంవత్సరాలుగా సోలార్ ప్లాంటు విజయవంతంగా నడుస్తోంది.

ఇతర డిపోల్లో ఏర్పాటుకు సన్నాహాలు

మదనపల్లె ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంటు సక్సెస్ కావడంతో రాష్ట్రంలోని అన్ని డిపోల్లో ఏర్పాటు చేసేందుకు ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. త్వరలో అన్ని డిపోల్లో ఏర్పాటుకు సన్నాహాలు మొదలుపెట్టారు.

సంప్రదాయేతర ఇంధన వనరులకు ప్రోత్సాహం



సంప్రదాయేతర ఇంధన వనరులను ప్రోత్సహించాలనే ప్రణాళికల్లో భాగంగా మదనపల్లె డిపోలోని బస్ స్టేషన్‌పై సోలార్ విద్యుత్ ప్లాంటు ఏర్పాటు చేశారు. దీని వల్ల ఆర్టీసీకి నెలకు రూ. లక్ష వరకు ఆదా అవుతోంది. -వెంకటరమణారెడ్డి, వన్ డిపో మేనేజర్, మదనపల్లె

దాతలు ముందుకు రావాలి



పాఠశాలలో ఖతర్‌లో పని చేసే రవి సుబ్రమణ్యం సోలార్ ప్లాంటు ఏర్పాటు చేయడం అభినందనీయం. దాతలు ముందుకు వస్తే మరింత అభివృద్ధి చెందుతుంది. -సుబ్బారెడ్డి, హెచ్‌ఎం, జెడ్పీ ఉన్నత పాఠశాల, మదనపల్లె

నాడు రూ.18 వేలు .. నేడు రూ.2 వేలు



పాఠశాలలో ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ పలకలు

ఓ దాత సహకారంతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సౌర వెలుగులు విరజిమ్ముతున్నాయి. గతంలో రూ.18 వేలు వచ్చే కరెంటు బిల్లు సౌర ప్లాంటు ఏర్పాటుతో ప్రస్తుతం రూ.2 వేలు బిల్లు వస్తోంది. దీంతో పాఠశాల నిర్వహణ ఖర్చుల భారం బాగా తగ్గిపోయింది. పలమనేరు మండలం మొరం గ్రామానికి చెందిన రవిసుబ్రమణ్యం ఖతర్‌లో ఉద్యోగం చేస్తున్నారు. ఈయన చిన్నప్పుడు మదనపల్లెలో చదువుకున్నాడు. ఆయనకు విద్య బోధించిన ఉపాధ్యాయులు ఫణీంద్ర ప్రస్తుతం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఇటీవల మదనపల్లెకు వచ్చినప్పుడు తన గురువును కలిసి సన్మానం చేయనున్నట్లు కోరాడు. దీనికి ఉపాధ్యాయుడు నిరాకరించి పాఠశాలలో సోలార్ ప్లాంటు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన అభ్యర్థన మేరకు రూ.4.50 లక్షల వ్యయంతో సౌరప్లాంట్‌ను మూడేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ 60 యూనిట్లు విద్యుత్‌ను ఉత్పత్తి చేసేలా 50 సోలార్ పలకలను ఏర్పాటు చేశారు. దీని ద్వారా సరఫరా అయ్యే విద్యుత్‌ను పాఠశాలలోని 55 గదులలో ఫ్యాన్లు, లైట్లకు వినియోగించేలా వైరింగ్ చేశారు. పాఠశాల ఆవరణంలో తాగునీటి కోసం బోరు కూడా వినియోగిస్తున్నారు. గతంలో నెలకు రూ. 15 వేలు నుంచి 18 వేలు వరకు వచ్చే బిల్లు ప్రస్తుతం రూ.2 వేలు లోపే వస్తోంది. పాఠశాలలోని తరగతి గదులు, ల్యాబ్‌లు ,గ్రంథాలయం, కార్యాలయంతో పాటు అవసరం ఉన్న ప్రాంతాలకు సౌర విద్యుత్‌నే వినియోగిస్తున్నారు.

క్లుప్తంగా

పొలాల్లో తీగల చోరీ



తీగలు దోచుకెళ్లగా మిగిలిన బోరు బావి

రాయచోటి టౌన్: పొలాల వద్ద మోటార్ల తీగలు, స్టార్టర్లు గురువారం చోరీకి గురయ్యాయి. రాయచోటి రూరల్ పరిధిలోని పెద్దకాల్వపల్లె సమీపంలో పొలాల వద్ద ఐదుగురు రైతులకు చెందిన మోటార్ల తీగలు, స్టార్టర్లు చోరీ చేశారు. బుధవారం రాత్రి దొంగలు వచ్చి స్తంభం నుంచి మోటారు తీగలు, ఇతర సామగ్రి ఎత్తుకెళ్లినట్లు రైతులు తెలిపారు. రాత్రి వరి నారు మడికి నీరందించాలంటే మళ్లీ రూ.15వేలు ఖర్చు చేయాల్సి వస్తోందని రైతు రామాంజనేయరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చోరీలకు పాల్పడుతున్న దొంగలను పట్టుకొని తమకు న్యాయం చేయాలని పోలీసులను వారు కోరారు.

రెండు కార్లు దగ్ధం



ద్రవంతో మంటలు ఆర్పుతున్న అధికారులు

రాయచోటి టౌన్: పట్టణంలోని మాసాపేట అపార్ట్‌మెంట్ కింద పార్కింగ్ చేసిన రెండు కార్లు గురువారం దగ్ధమై రూ.6 లక్షలు నష్టపోయినట్లు బాధితులు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎగువ భాగాన సాయి ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారు. అక్కడ రెండు కార్లు పార్కింగ్ చేసి ఉంచారు. బ్యాటరీలో పొగలు రావడంతో ఒక కారు పూర్తిగా కాలిపోగా, మరో కారు పాక్షికంగా కాలింది. అగ్నిమాపక అధికారులు మంటలు ఆర్పివేశారు.

చంపుతాడేమోనని.. చంపేశాడు

ప్రొద్దుటూరు డీఎస్పీ మురళీధర్

ప్రొద్దుటూరు క్రైం : తాను ఇష్టపడే మహిళను దూరం చేస్తాడనే భయంతో.. ద్వేషం పెంచుకున్న ఒకడు.. అతడి అడ్డు తొలగించుకోవాలని కుట్ర పన్నాడు.. అదును చూసుకుని ప్రత్యర్థిని కిరాతకంగా చంపేశాడు.. డీఎస్పీ మురళీధర్ విలేకరులతో గురువారం వివరాలు వెల్లడించారు.

నాగరత్నమ్మకు 30 ఏళ్ల కిందట శ్రీనివాసులు రెడ్డితో వివాహమైంది. వీరికి మహేశ్వరరెడ్డి(12) సంతానం. కొంత కాలానికి శ్రీనివాసులురెడ్డి మృతి చెందడంతో రామచంద్రారెడ్డి అనే మిఠాయి వ్యాపారితో 18 ఏళ్లుగా నాగరత్నమ్మ సహజీవనం చేస్తోంది. రామచంద్రారెడ్డి, నాగరత్నమ్మ, మహేశ్వరరెడ్డి కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నారు. కొన్ని నెలల కిందట నాగరత్నమ్మ వద్ద రూ.3 లక్షలు రామచంద్రారెడ్డి అప్పు తీసుకున్నాడు. ఇటీవల మహేశ్వరరెడ్డి మద్యానికి బానిసై గొడవ పడేవాడు. దీంతో రామచంద్రారెడ్డి అతడిని సిమెంట్ ఫ్యాక్టరీలో కాంట్రాక్ట్ లేబర్‌గా చేర్పించాడు. ఇదిలా ఉంటే మృతుడు మహేశ్వరరెడ్డికి ఓ యువతితో పరిచయం ఏర్పడింది. ఈ విషయంపై నాగరత్నమ్మ, రామచంద్రారెడ్డి అతడిని మందలించారు. ఇదే సమయంలో రామచంద్రారెడ్డి ఆ యువతితో చనువుగా ఉన్నాడనే విషయం తెలుసుకున్న మహేశ్వరరెడ్డి తరచూ ఆగ్రహం వ్యక్తం చేసేవాడు. ఈ నేపథ్యంలో తన తల్లి వద్ద తీసుకున్న డబ్బు తిరిగి ఇచ్చేయాలని.. తాము కలిసి ఎక్కడికైనా వెళ్లి బతుకుతామని చెప్పాడు. దీంతో నాగరత్నమ్మ తన నుంచి దూరం అవుతుందని భావించిన రామచంద్రారెడ్డి డబ్బు ఇవ్వకుండా మాట దాటేస్తూ వచ్చాడు. తన తల్లిని దూరం చేసేందుకు ఇలా చేస్తున్నావంటూ తరచూ గొడవపడుతుండడంతో మహేశ్వరరెడ్డి తనను ఎక్కడ చంపేస్తాడోనని.. రామచంద్రారెడ్డి భయపడ్డాడు. ఈ నెల 25న నిద్రపోతున్న అతడిని రామచంద్రారెడ్డి హతమార్చాడు. మృతదేహాన్ని బయటికి తీసుకెళ్లడం సాధ్యం కాదని మూడు ముక్కలుగా నరికాడు. తర్వాత రెండు ప్లాస్టిక్ సంచుల్లో వేసుకొని బైక్‌లో తీసుకెళ్లి శివారు ప్రాంతంలో పడేశాడు. అనంతరం చాపాడు మండలంలోని కొండపేటలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి తలదాచుకున్నాడు.



అరెస్టు వివరాలను మీడియాకు వివరిస్తున్న డీఎస్పీ మురళీధర్

తల్లి ఫిర్యాదుతో కేసు ఛేదించారు

వైఎంఆర్ కాలనీలోని తన ఇంట్లో కుమారుడు కనిపించడం లేదని 24న ఉదయం నాగరత్నమ్మ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రామచంద్రారెడ్డి అనే వ్యక్తిపై ఆమె అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు విచారణ మొదలుపెట్టారు. రక్తపు మరకలు ఉండడం.. సంఘటనా స్థలంలో మృతదేహం కనిపించకపోవడం పోలీసులను ఆందోళనకు గురిచేసింది. సీసీ ఫుటేజీ, డాగ్ స్క్వాడ్, ఇతర టెక్నాలజీ ఆధారంగా మహేశ్వరరెడ్డి మృతదేహం రాయల్ కౌంటీకి వెళ్లే దారిలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అక్కడ ముళ్ల పొదల్లోని ప్లాస్టిక్ సంచుల్లో ఉన్న మహేశ్వరరెడ్డి మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి పంపి పోస్టుమార్టం చేయించారు. ఇది తెలుసుకున్న తల్లి నాగరత్నమ్మ «నా కుమారుడ్ని ఎందుకు అంత క్రూరంగా చంపాల్సి వచ్చింది.. చంపాల్సినంత తప్పు మా వాడు ఏం చేశాడు» అంటూ రోదించింది. రామచంద్రారెడ్డిపై అనుమానంతో విచారించిన పోలీసులు లొకేషన్ ఆధారంగా అతడు ఉన్న చోటు గుర్తించి గురువారం అరెస్ట్ చేశారు. హత్యకు ఉపయోగించిన రాడ్డు, గొడ్డలిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడు రామచంద్రారెడ్డిని పట్టుకోవడంలో ప్రతిభ చూపిన త్రీటౌన్ సీఐ వెంకటరమణ, టూటౌన్ సీఐ అబ్దుల్‌కరీం, రూరల్ సీఐ రమణారెడ్డి, వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్ పోలీసు బృందాలను డీఎస్పీ అభినందించారు. ఎస్పీ ద్వారా ప్రత్యేక రివార్డు అందజేయనున్నట్లు తెలిపారు.

మామిడి చెట్ల నరికివేత



నరికి వేసిన మామిడి చెట్లు

వీరబల్లి : మండలంలోని సంఘంవాండ్లపల్లెలో తమ మామిడి తోటలో 20 మామిడి చెట్లను గురువారం గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేసినట్లు సర్పంచ్ దయ్యాలకృష్ణయ్య కుమారుడు నరసింహులు తెలిపారు. గురువారం ఉదయం పొలం వద్దకు వెళ్లగా 20 మామిడి చెట్లు నరికి వేసినట్లు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తనపై కక్ష సాధింపుతోనే ప్రత్యర్థులు నరికి వేసి ఉంటారని దయ్యాలకృష్ణయ్య తెలిపారు. నిందితులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

గాయపడిన వ్యక్తి మృతి

పెద్దతిప్ప సముద్రం : మండలంలోని పోతుపేట సమీపంలో ఈ నెల 25న జరిగిన రోడ్డుప్రమాదంలో పూజారి రామప్ప(60) తీవ్రంగా గాయపడ్డాడు. తిరుపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

అనారోగ్యంతో ఆశా వర్కర్

పెద్దతిప్పసముద్రం : మండలంలోని అంకిరెడ్డిపల్లి పంచాయతీ కొండయ్యగారిపల్లికి చెందిన వెంకటేశ్వరమ్మ(45) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు.

విద్యుత్తు షాక్‌తో మరొకరు..

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పట్టేవాండ్లపల్లి పంచాయతీ వడ్డేపల్లికి చెందిన గుర్రంకొండ రమణ (50) విద్యుత్ షాక్‌తో గురువారం మృతి చెందాడు. మృతుడు రమణ సత్యసాయి జిల్లా పూలకుంట వద్ద వ్యవసాయ పనులు చేస్తున్నాడు. పొలం వద్ద ముళ్ల కంపలు తొలగిస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్తు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య పిల్లలు ఉన్నారు. తనకల్లు పోలీసులు కేసు నమోదు చేశారు.

కొనుగోలు పేరిట మోసం

ఫేక్ యాప్‌తో డబ్బు చెల్లించినట్టు నమ్మించిన వైనం

బి.కొత్తకోట : ఎలక్ట్రికల్ సామగ్రి తీసుకుని.. ఫేక్ యాప్‌తో బిల్లు చెల్లించినట్లు చూపి.. ఉడాయించారు ఓ వ్యక్తి. అసలు విషయం తెలిసి దుకాణదారులు లబోదిబోమంటున్నారు. బాధితుల వివరాల మేరకు.. సత్యసాయి జిల్లాకు చెందిన ఓ వ్యక్తి సమీపంలోని బి.కొత్తకోట, ములకలచెరువు, సత్యసాయి జిల్లా, కర్ణాటకలోని పలు ప్రాంతాల హార్డ్‌వేర్ దుకాణాల వద్దకు వెళ్లి పెయింట్స్, ఎలక్ట్రికల్ వస్తువులు కావాలని చీటీ రాసిస్తున్నాడు. వాటిని ప్యాక్ చేసి బిల్లు ఇచ్చాక బ్యాంకు ఖాతాకు నగదు పంపిస్తానంటూ ఖాతా సంఖ్య తీసుకుని సామాగ్రి బిల్లు, నగదు కలిపి బ్యాంకు ఖాతాకు జమ చేశానని చెప్పి చెల్లించినట్టు ఫేక్ యాప్ ద్వారా చూపిస్తాడు. నమ్ముతూ వచ్చిన దుకాణదారులు అనంతరం మోసపోయినట్లు తెలిసి ఆవేదన చెందుతున్నారు. ఇటీవల ఓ దుకాణంలో ఇలాగే చేసిన ఆ వ్యక్తి అర్జంట్‌గా రూ.15 వేలు కావాలని నగదు కూడా తీసుకుని ఖాతాకు జమచేసినట్టు చెప్పాడు. అనంతరం మోసపోయిన దుకాణదారుడు సీసీ కెమేరాలో అతడిని గుర్తించి అన్ని దుకాణాలకు వాట్సాప్‌లో మెసేజ్ పెట్టడంతో దుకాణదారులు అప్రమత్తమయ్యారు.

భార్యను చంపిన భర్త అరెస్ట్

బి.కొత్తకోట : భార్యను చంపిన కేసులో నిందితుడైన భర్తను అరెస్టు చేసినట్టు సీఐ సూర్యనారాయణ తెలిపారు. కర్ణాటకలోని ఎగువకోటకు చెందిన మల్లికార్జునతో(32)తో 12 ఏళ్ల కిందట బి.కొత్తకోట మండలం పత్రవారిపల్లెకు చెందిన అన్నపూర్ణ(28)తో వివాహమైంది. వీరికి ఒకరు సంతానం. అనంతరం మల్లికార్జున మరో మహిళను వివాహం చేసుకోగా వారికి ముగ్గురు సంతానం. ఈ మధ్య కుటుంబంలో జరిగిన ఘటనలతో రెండో భార్య తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆ కేసులో నిందితుడి మల్లికార్జునను పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. జైలు నుంచి వచ్చిన మల్లికార్జున ఇటీవల మొదటి భార్య అన్నపూర్ణను కలిసి తనకు దూరంగా ఉండాలని కోరాడు. అయితే ఆమె కలిసుందామని కోరడంతో ఇద్దరి మధ్య బేధాభిప్రాయాలు చోటుచేసుకున్నాయి. దీంతో ఆమెను స్వగ్రామానికి తీసుకెళ్లి.. మళ్లీ పత్రవారిపల్లెకు తీసుకొస్తూ మార్గమధ్యంలో జమాలమ్మ దర్గా వద్ద అన్నపూర్ణ గొంతు నులిమి హత్య చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడైన మల్లికార్జునను మండలంలోని ఠానామిట్ట చెక్ పోస్టు వద్ద అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు.



నిందితుని అరెస్టు చూపుతున్న సీఐ

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



కారుతో సహా ఎర్రచందనం స్వాధీనం చేసుకున్న అటవీ అధికారులు

పీలేరు : కారుతో సహా రూ.25 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు డీఎఫ్‌వో జె.వి.సుబ్బారెడ్డి తెలిపారు. అటవీ అధికారులకు అందిన సమాచారం మేరకు గురువారం తెల్లవారుజామున చిత్తూరు రోడ్డులోని జ్యోతీ నగర్ వద్ద ప్రత్యేక నిఘా పెట్టారు. ఇంతలో అక్కడికి వచ్చిన కారును సిబ్బంది ఆపగా., వాహనం ఆపి దుండగులు పరారయ్యారు. కారులో ఉన్న 439 కిలోల బరువుగల 16 ఎర్ర చందనం దుంగలను వారు స్వాధీనం చేసుకున్నారు. ఎఫ్ఆర్‌వోలు వెంకటరమణ, కె.ప్రతాప్, నాగేంద్రబాబు, ఎ.దేవేంద్ర, ఎ.వెంకటేష్, పి.మల్లికార్జున, చరణ్ పాల్గొన్నారు.

రైతులకు నైపుణ్య ఆధారిత శిక్షణ

కడప అగ్రికల్చర్ : వానపాము ఎరువుల తయారీ, ఇతర అంశాలపై రైతులకు ఇస్తున్న నైపుణ్య ఆధారిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ప్రశాంతి సూచించారు. ఊటుకూరు కేవీకేలో గురువారం జరిగిన నైపుణ్య ఆధారిత శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ శిక్షణ పొందిన అనంతరం ఆచరణ పెడుతూ జీవనోపాధి పొందాలని సూచించారు. శాస్త్రవేత్త డాక్టర్ శిల్పకళ మాట్లాడుతూ విచక్షణా రహితంగా రసాయన ఎరువు వాడితే భూ సమతుల్యత దెబ్బతిని ఉత్పాదకత తగ్గిపోతుందన్నారు. సేద్య విభాగ శాస్త్రవేత్త సాయి మహేశ్వరి మాట్లాడుతూ వర్షాధార పరిస్థితులతో ఆర్థిక సుస్థిరత సాధించడం కష్టతరం కాబట్టి వానపాముల తయారీని కుటీర పరిశ్రమగా ఎంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పశు విభాగ శాస్త్రవేత్త డాక్టర్ సురేష్ మానస, మమత, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్. సాయిమహేశ్వరి

కళాకారుడి ఇంట్లో చోరీ

మదనపల్లె : కళాకారుడి ఇంట్లో రూ.6 లక్షల నగదు, ఇతర విలువైన వస్తువులను గురువారం చోరీకి గురయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. ఇసుకనూతి పల్లె సమీపంలోని టీఎస్ఆర్ కాలనీకి చెందిన విజయకుమార్ సంగీత కళాకారుడిగా పని చేస్తున్నాడు. అతడి కుమారుడు హార్మోనిస్ట్. మూడు రోజుల కిందట కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతికి వెళ్లారు. ఈ సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి బీరువా పగలగొట్టి, నగదు, నగలను దోచుకెళ్లారు. బుధవారం రాత్రి విజయకుమార్ తమ్ముడు విషయం తెలుసుకుని సోదరుడికి తెలపడంతో ఆయన పోలీసులను ఫిర్యాదు చేశాడు. దాదాపు రూ.2.5 లక్షల నగదు, 80 గ్రాముల బంగారు నగలు, ఖరీదైన వాచీలు, వెండి వస్తువులు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. క్లూస్ టీంతో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేఖర్ తెలిపారు.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

ఇద్దరికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు గాయపడి స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లెలోని మంజునాథ కాలనీకి చెందిన వెంకటరమణ కుమారుడు రామయ్య(45) పనులు ముగించుకుని ఆటోలో ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అదే విధంగా ములకలచెరువు మండలం చౌడసముద్రం పంచాయతీ చెట్లవారిపల్లెకు చెందిన రామిరెడ్డి కుమారుడు నాగిరెడ్డి(59) వ్యక్తిగత పనులు ముగించుకుని చౌడసముద్రానికి ద్విచక్ర వాహనంలో వస్తుండగా, మార్గ మధ్యంలో వాహనం టైరు పంక్చర్‌కావడంతో కింద పడి గాయాలయ్యాయి. స్థానికులు బాధితులను 108 వాహనంలో మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఆస్తి కోసం అత్తామామలను కడతేర్చి

వీరబల్లి : ఆస్తి తనకు ఇవ్వలేదనే కోపం.. వారి బాగోగులు చూడాలనే ఆవేదన వెరసి ఓ యువతి తన అత్తమామలను మట్టు పెట్టాలని పథకం వేసింది. ముష్టిచెక్కబెల్లం నూరి వారికి తాగించి చంపేసింది. పోలీసుల వివరాల మేరకు.. అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం కొత్తవడ్డిపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణను అదే గ్రామానికి చెందిన కళావతి వివాహం చేసుకుంది. భర్త మద్యానికి బానిస కావడంతో అత్త, మామలు నాగసుబ్బన్న(80), నాగమ్మ70) బాగోగులు కళావతి చూడాల్సి వచ్చింది. ఆస్తిని తన పేరుతో రాయించుకుని వారిని మట్టుపెట్టాలని భావించింది. భర్త వెంకటరమణకు పూటుగా మద్యం తాగించింది. అతడు మత్తులో ఉన్న సమయంలో ముష్టి చెక్కబెల్లం నూరి తన అత్తామామలతో బలవంతంగా తాగించింది. విలవిలలాడుతున్న వారిని స్థానికులు గమనించి రాయచోటి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





మృతులు నాగ సుబ్బన్న (80), నాగమ్మ(70)

పించానదిలో పడి విద్యార్థి మృతి

సుండుపల్లె : పింఛా నదిలో పడి విద్యార్థి యశ్వంత్‌నాయక్ (15) మృతి చెందినట్లు ఎస్ఐ హుస్సేన్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. పింఛాకు చెందిన మునెనాయక్ వెటర్నరీ కార్యాలయంలో పని చేస్తున్నాడు. ఇతడి భార్య జీవనోపాధి కోసం కువైట్‌కు వెళ్లారు. వీరి కుమారుడు యశ్వంత్ నాయక్ నవోదయ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. సెలవుల నేపథ్యంలో ఇంటి వద్దే ఉన్నారు. గురువారం ఉదయం తండ్రి తన కుమార్తెను పాఠశాలలో చేర్పించేందుకు వెళ్లగా యశ్వంత్ నాయక్ పింఛా నదిలో స్నానం చేసేందుకు వెళ్లారు. అక్కడ నీటి గుంతలో పడి ఊపిరాడక మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని తండ్రి మునె నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



మృతిచెందిన విద్యార్థి యశ్వంత్‌నాయక్

ఫ్లాష్.. ఫ్లాష్..

అర్ధరాత్రి దారుణం

ఊరంతా నిద్రపోయిన వేళ... చుట్టూ చిమ్మ చీకటి... ఊరికి సమీపంలో బోరు బావి.... అక్కడి పూరిపాకలో కటిక చీకటిలో క్రూరత్వం కళ్ళు తెరిచిన వేళ.... వారిని నమ్మి వచ్చిన ఓ వివాహిత గొంతుకోసి దారుణంగా హతమార్చిన యువకులు.. ఈ దృశ్యాన్ని పొరపాటున చూసి ఓ రైతుపైనా దాడి చేశారు. ఆమె విలవిలలాడుతూ ప్రాణాలు వదలగా.. యువకుడు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు.

- గొంతుకోసి యువతిని క్రూరంగా చంపిన వైనం
- హత్యను చూసిన యువకుడిపై కత్తితో దాడి
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ సద్గురుడు



హత్యకు గురైన వివాహిత



గాయపడిన మంజునాథ

నిమ్మనపల్లె: గుర్తు తెలియని యువతి(20) అత్యంత కిరాతకంగా హత్యకు గురైన సంఘటన గురువారం రాత్రి నిమ్మనపల్లె మండలంలో జరిగింది. స్థానికులు, పోలీసులు, బాధితుడి కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. దివిటివారిపల్లె గ్రామంలో నివాసముంటున్న వెంకటరమణ కుమారుడు మంజునాథ(30) ట్రాక్టర్ డ్రైవర్గా పనిచేస్తున్నాడు. ఊరికి సమీపంలో ఇతడికి బోరు బావి ఉంది. అక్కడే వ్యవసాయ అవసరాల కోసం చిన్న పూరిపాక వేసుకున్నారు. ఇతడికి భార్య శిరీష, ఇద్దరు కుమారులు ఉన్నారు. గురువారం పగలు విద్యుత్తు లేకపోవడంతో రాత్రి భోజనం చేసి పంటకు నీరందించేందుకు వెళ్లాడు. అదే సమయంలో తమ పూరిపాకలో నుంచి వెలుగు రావడాన్ని గమనించాడు. అక్కడికి వెళ్లిన అతడు అప్పటికే గొంతు కోయబడి రక్తపు మడుగులో పడిన ఓ వివాహిత ఉండటాన్ని గమనించాడు. ఇదే సమయంలో ఆమెను హత్య చేసేందుకు వచ్చిన ఇద్దరు దుండగులు ఒక్కసారిగా మంజునాథ్‌పై తెగబడ్డారు. కత్తితో విచక్షణా రహితంగా దాడి చేయడంతో, గొంతుపై గాయాలయ్యాయి. తన సెల్ ఫోన్ అక్కడే వదిలి మంజునాథ్ గ్రామంలోకి పరిగెత్తాడు. అప్పటికే అతడికి మాటలు రాకపోవడంతో కుటుంబ సభ్యులు మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి తరలించారు. దివిటివారిపల్లెలో యువతి దారుణంగా హత్యకు గురైందనే సమాచారం బయటకు పొక్కడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మదనపల్లె రూరల్ సీఐ సద్గురుడు, నిమ్మనపల్లె పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. హత్య ప్రదేశాన్ని వీడియో రికార్డింగ్ చేశారు. యువతి మెడలో తాళిబొట్టు ఉండడంతో వివాహితగా గుర్తించారు. యువతి క్రూరంగా గొంతు పూర్తిగా కోయబడి, చూడడానికే భయం గొలిపేలా పడి ఉంది. పూరిపాకకు సమీపంలో చెప్పులు, హెల్మెట్, బీడీకట్ట, పడి ఉన్నాయి. ఆమెను హత్య చేసిన అనంతరం, అది చూసిన స్థానిక యువకుడిపై దాడి చేసి దుండగులు పారిపోయినట్లు గుర్తించారు. ఆమెతోపాటు ఇద్దరు వ్యక్తులు వచ్చినట్లు గుర్తించారు. వివాహిత ఎవరు? ఇక్కడికి ఎందుకు వచ్చింది? ఎవరితో వచ్చింది? హత్య ఎందుకు జరిగింది? అన్న వివరాలు తెలియాల్సి ఉంది.

మద్యం మత్తులో భార్యను హతమార్చారు

డీఎస్పీ ప్రసాదరెడ్డి వెల్లడి

మదనపల్లె : ఇంట్లో పెంచుకుంటున్న కోళ్లు చనిపోయిన విషయం చెప్పలేదనే కోపంలో మద్యం మత్తులో భార్యను కిరాతకంగా కొడవలితో నరికి చంపేసిన లక్ష్మీరెడ్డిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ ప్రసాదరెడ్డి తెలిపారు. మదనపల్లె రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కురబలకోట మండలం పిచ్చలవాండ్లపల్లె పంచాయతీ మేకలవారిపల్లెకు చెందిన టి.లక్ష్మీరెడ్డి(49) ఈ నెల 21న అర్ధరాత్రి మద్యం తాగి వచ్చి కోళ్ల విషయంలో గొడవపడ్డారు. మత్తులో నాకే ఎదురు మాట్లాడతావా అంటూ భార్యను కొడవలి తీసుకుని నరికేశాడు. అనంతరం నిందితుడు పారిపోగా.. కేసు నమోదుచేసి విచారించిన ప్రత్యేక దర్యాప్తు బృందం లక్ష్మీరెడ్డిని కడప క్రాస్ వద్ద అరెస్టు చేశారు. మచ్చు కొడవలిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐ సద్గురుడు, ఎస్సై మల్లికార్జున రెడ్డి, యువరాజు, తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీరెడ్డి అరెస్టు చూపుతున్న మదనపల్లె డీఎస్పీ ప్రసాదరెడ్డి

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ములకల చెరువు మండలం సోంపల్లె పంచాయతీ తంబళ్లవారిపల్లెకు చెందిన శివన్న కుమారుడు చంద్రశేఖర్(30) భార్య కుటుంబ సమస్యలతో భర్తపై అలిగి ఏడాది క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య కాపురానికి రాకపోగా, భర్త వద్ద ఉన్న కుమార్తెను తన వద్దకు పంపించాల్సిందిగా సమాచారం పంపింది. దీంతో మనస్తాపం చెందిన చంద్రశేఖర్ ఇంట్లోనే పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదే విధంగా రామసముద్రం మండలం తిరుమలరెడ్డిపల్లెకు చెందిన సురేష్ భార్య కవిత(30) భర్తతో గొడవపడి మనస్తాపం చెంది ఇంటి వద్దే చీమలమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఆయా ఘటనల్లో కుటుంబ సభ్యులు బాధితుడిని 108 అంబులెన్స్‌లో మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

బాలుడికి జన్యు లోపం

- వైద్య చికిత్సకు రూ.20 లక్షలు అవసరమన్న వైద్యులు
- తమ బిడ్డను ఆదుకోవాలని తల్లిదండ్రుల వేడుకోలు

సిద్దవటం : కడుపులో గడ్డ రోజు రోజుకూ పెరుగుతుండడంతో ఆ బాలుడు నరక యాతన పడుతున్నాడు. నొప్పి తాళలేక కన్నీటి పర్యంతమవుతున్నాడు.. బాలుడి దైన్యం చూసి ఆస్పత్రికి తీసుకెళ్లిన తల్లిదండ్రులతో చికిత్సకు రూ.20 లక్షలు అవుతుందన్న వైద్యుల మాటలు విని కంటతడి పెట్టారు. అంత పెద్ద మొత్తం తెచ్చుకోలేక.. బాలుడి పరిస్థితి చూడలేక వారు పడుతున్న వేదన వర్ణనాతీతం. సిద్దవటం మండలంలోని భాకరాపేటలో ఉండే పల్లపోతుల వినయ్, సుప్రజల 15 నెలల కుమారుడు వెంకట రోహిత్ గోచర్ వ్యాధి సోకి జన్యు లోపంతో బాధపడుతున్నాడు. కడుపులో గడ్డ ఏర్పడి బాలుడి ఎదుగుదలకు అడ్డంకిగా మారింది. విపరీతమైన కడుపునొప్పితో బాధపడుతున్నాడు. తమ కుమారుడికి బోన్‌మార్ శస్త్ర చికిత్స అవసరమని.. ఇందుకు దాదాపు రూ.20 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారని తల్లిదండ్రులు పేర్కొన్నారు. కూలి పనులు చేసుకొని జీవనం సాగించే తమ వద్ద అంత మొత్తం లేదని కంటతడి పెట్టారు. దాతలు ఆర్థికసాయం చేసి తన బిడ్డను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

